


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 1 పుష్పం : 1-3 20-9-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 7** **ISSUE : 1**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## వాచక తపస్సు

సంభాషణ ఒక కళలాంటిది. సంభాషణలో సభ్యత, సరళత, సంస్కృతి ఉండాలి. భాష ఎంతముఖ్యమో భావముకూడా అంతే ముఖ్యము. ఉద్వేగములేకుండా, ఉద్రేకంలేకుండా, హేళనలేకుండా మనము మాట్లాడినప్పుడు ఇతరులకు దుఃఖము కలుగదు. నమ్రతతోకూడిన సంభాషణవలన ఇతరులు మన అభిప్రాయముతో అంగీకరించిన, అంగీకరించక పోయినా మన మనస్సుకి గాయము తగలదు. మాట నేర్పుగా, ఓర్పుగా, ప్రియముగా, హితకరముగా ఉండాలి. అధ్యయనములోను, ప్రవచనములోను అశ్రద్ధపనికిరాదు.

మంత్రజపముకూడా వాచకతపస్సులోనికే వస్తుంది. ఇతరులు మనపట్ల అసూయతో మాట్లాడినా మనం మౌనం వహించటం మంచిది. బాగా ఆలోచించికాని నోటితో మాట్లాడకూడదు. దీనివలన నోటికి పుణ్యంపస్తుంది. వాక్‌శుద్ధి కల్గుతుంది. శుద్ధి ఆత్మసిద్ధికి దారిచూపిస్తుంది. మృదువుగా సంభాషించటం సత్యాన్వేషకుడికి ముఖ్యాతిముఖ్యం. మాటలో కఠినత్వమువలన సమాజములో శత్రువులు పెరుగుతారు. మనమాట యితరులకు జ్ఞానోదయము కలుగుటకు సహకరించాలి. అందుకనే మాట దేవుడుతో సమానమని అంటారు. నోరుమంచిదయితే ఊరుమంచిదవుతుందనే సామెత ఉండనేఉన్నది. మనస్సులోనిగ్రహము, మాటలోనిగ్రహము లేనివాడికి మోక్షసుఖము అందదు.

- సద్గురు శ్రీనాన్నగారు

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు


23-08-2001 గెద్దనపల్లి .......... 3
30-08-2001 కోలమూరు .......... 8
02-09-2001 జిన్నూరు .......... 12

# మతం పేరిట హింస - అజ్ఞానానికి పరాకాష్ట

ఆత్మస్వరూపం మఱచుటవలన అజ్ఞానం కలుగుతుంది. దానినుండి మనస్సు ఉద్భవిస్తుంది. అజ్ఞానంనుంచి ఉద్భవించిన మూలాన మనస్సుద్వారా జరిగే క్రియలవల్ల ఎల్లప్పడూ అశాంతి కలుగుతుంది. ఈశ్వరుని (గురుని) అనుగ్రహంవల్ల, పుణ్యబలంవల్ల, సాధనాబలంవల్ల, కాలపరిపక్వతవల్ల మనస్సుకు ఆత్మజ్ఞానం తోస్తుంది. ఆత్మజ్ఞానం రుచిమరిగిన మనస్సు క్రమంగా సంస్కరింపబడుతుంది. అందరూ అజ్ఞానంలోనేఉన్నారు గనుక, వారిలో ఎవరికివారు స్వతంత్రంగా సత్యాన్వేషణచేసే సాహసం కొద్దిమందికే ఉంటుంది. మిగిలినవారు, సమూహముగా ఒక వ్యవస్థీకృతమైన మతాన్ని (Organised Religion) మనస్సును సంస్కరించే ఉద్దేశంతో ఏర్పరచుకొంటారు. సత్యములో శాంతిఉన్నదని, దానిని ఆలోచనద్వారా వెంబడించే ప్రయత్నంచేస్తారు. కొన్నాళ్లకు అసలు ఉద్దేశాన్ని మఱచి మనము ఫలానా, ఫలానా మతమునకు చెందినవారముగా భావించటం మొదలుపెట్టినప్పడు, మతంపేరిట భేదబుద్ధి జనిస్తుంది. అప్పడు ఇతర మతాలతో పేచీలు వస్తాయి. ఒకేమతంలోఉన్న శాఖలకుకూడా పేచీలువస్తాయి. మనస్సును సంస్కరించుకోవడం మానేసి, మతంపేరిట హింసజరగటం పూర్వంనుంచీఉంది. పదహారువేల క్రూసేడ్లు అనే మతయుద్ధాలు చరిత్రలో నమోదైనవి. నమోదుకాని హింస ఇంకాచాలా ఉంటుంది. మతంపేరిట జరిగే హింసవల్ల, మానవజాతి చాలాకష్టాలపాలయినది. కాని మానవజాతి దానినుండి గుణపాఠం నేర్చుకోలేదు. వర్తమాన పరిస్థితికూడా అలాగేఉంది. చేసిన తప్పమళ్లీ చేయటం అజ్ఞాన లక్షణం. మనస్సును సంస్కరించుకోవడానికి ఏర్పడ్డ మతంపేరిటమీదకూడా ఒకరినొకరు చంపుకోవటం అజ్ఞానానికి పరాకాష్ఠ. మనం ఏ మతంలోఉన్నామో అన్నది ప్రధానంకాదు. మన మనస్సు ఆ మతంవల్ల ఎంతవరకు సంస్కరింపబడింది అనేది ముఖ్యం. మనస్సు సంస్కరించుకోవడానికే మతాన్ని ఉపయోగించుకొన్నప్పడు, దానివల్ల భేదబుద్ధి జనించదు, కనుక దానిద్వారా హింసజరగదు. ప్రస్తుతం మానవజాతి ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించుకోవాలి.

- Dr. P.V.S. సూర్యనారాయణ రాజు

# గౌరవం వచ్చినప్పుడు పొంగిపోయేది, అగౌరవం వచ్చినప్పుడు కృంగిపోయేది "నేను దేహమును" అనే ప్రథమతలంపు

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 23-08-01, గెద్దనపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎన్నియోగాభ్యాసాలుచేసిన స్వార్థంఉన్నవాడికి పరమార్థం అందదు. భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు ఆయనను మనం మోసంచేయలేము. కాలంయొక్క విలువ మనకు తెలియటంలేదు. ఇప్పడు ఈ గ్రామంలోఉన్న ధనంఅంతా రాశిగాపోసినా జరిగిపోయిన క్షణాన్ని వెనుకకు తీసుకొనిరాలేము. ధనంపెట్టి కాలాన్నికొనలేము. అందువలన మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్జునా! నీవు నేను మాట్లాడుకొన్న ఈ మాటలను ఎవడైతే అర్థంచేసుకొని, ఇతరులకు అర్థమయ్యేలా చెప్పుతున్నాడో వాడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడు అని గీతలో భగవంతుడు చెప్పాడు. మనం ఆహారం విషయంలో యుక్తంగాఉండాలి, విహారం విషయంలో యుక్తంగాఉండాలి అంటే సమాజంపట్ల మనకుఉన్న అనుబంధం అతిగా ఉండకూడదు. అతిగా మాట్లాడకూడదు, అతిగాతినకూడదు, అతినిద్రపనికిరాదు. అతిగా ఉండటంవలన యోగంలో మనం సక్సెస్ అవ్వలేము. భగవంతునిమీద ప్రేమలేకుండా, భక్తిలేకుండా, ప్రీతిలేకుండా ఏదో యాంత్రికంగా సాధనలు చేయటంవలన మనకు భగవదనుభవం కలుగదు. ఏదైనా వస్తువును సాధించాలి అనుకొన్నప్పడు దానిమీద మనకు ప్రేమఉండాలి, ఇష్టంఉండాలి. ప్రేమలేకుండా, ప్రీతిలేకుండా మనం ప్రయత్నంచేసినా అది మనసొంతం అవ్వదు. మనం ఏమార్గంలో ప్రయాణంచేసినా మనలో అజ్ఞానంఉందా, లేదా అని చూసుకోవాలి. మీలో అజ్ఞానం లేకపోతే ఇబ్బందిలేదు, ఉంటే ప్రయత్నంచేసి దానిని పోగొట్టుకోవాలి. శరీరానికి మరణం వచ్చినప్పడు ఆ శరీరానికి ముగింపుఉందిగాని జీవితానికి ముగింపులేదు. చైతన్యానుభవం కలిగేవరకు ఇటువంటి శరీరాలు వస్తూనే ఉంటాయి, జీవితం కంటిన్యూ అవుతుంది.

దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన వీటిగురించి ఆచార్యులవారు వివరించారు. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే అసలు మీకు దేహం ఎప్పడువస్తోంది, లోకం ఎప్పడువస్తోంది, శాస్త్రం ఎప్పడువస్తోంది. నేనుఅనేప్రథమతలంపువచ్చాక దేహంవస్తోంది, దేహంవచ్చాక లోకంవస్తోంది, లోకంవచ్చాక శాస్త్రంవస్తోంది, దేవుడు వస్తున్నాడు. ఏదివచ్చాక ఇవిఅన్నీ వస్తున్నాయో, దానిని ఎందుకు వదిలేస్తున్నారు. గాఢనిద్రలో దేహవాసన, లోకవాసన,

శాస్త్రవాసన ఇవిఏమీలేవు. నేనుఅనేతలంపు లేనప్పుడు నీకుదేహంఉన్నా నాకు ఒకదేహంఉంది అని నీకు తెలియటంలేదు. గాఢనిద్రలో నాకు దేహంఉందిఅని ఎవరికి తెలియదు. ఏదివచ్చాక ఇవిఅన్నీ వస్తున్నాయి? నేనుఅనేతలంపువచ్చాక దేహంవస్తోంది, లోకంవస్తోంది, శాస్త్రంవస్తోంది, దేవుడువస్తున్నాడు. మొత్తం ఖగోళంఅంతా నేనుఅనే మొదటి తలంపుమీద ఆధారపడిఉంది. దానిని డౌట్‌చెయ్యి, దానిని షేక్‌చెయ్యి. దానిని తీసి ఒకప్రక్కనపెట్టు నేనుఅనే మొదటి తలంపు నిజంఅని నీవు అనుకొంటున్నావు. అలా అనుకొన్నంతకాలం జననమరణ చక్రంలోనుండి నీవు విడుదలపొందలేవు. నేనుఅనే మొదటితలంపును మినహాయించి మీరు ఎన్నిసాధనలుచేసినా ప్రయోజనంలేదు. మీరుచేసే సాధనలో మూలతలంపును ఇన్వాల్వ్‌చేయాలి. ఈ మూలతలంపునే మనస్సుఅని, జీవుడుఅని, చిజ్జడగ్రంథిఅని, అహంకారంఅని అంటారు. మొత్తం సృష్టిఅంతా దానిమీదేఉంది. దానిని డౌట్‌చేసి, షేక్‌చేసి, దానిని తొలగిస్తే ఏమీలేదు, ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.

భగవదనుభవం పొందటానికి కృషి, కృప రెండూఅవసరం. కృషిలేకుండా కృపరాదు. మన అందరకు బుద్ధిఉంది, దానిని ఉపయోగించుకొని కృషిచేయాలి. భగవంతుడు అంతర్యామి. మనం చేస్తున్న కృషి ఆయనకు తెలుసు. మనకు జ్ఞానంపట్లఉన్న అపేక్షనుచూసి పరిస్థితులు మనకు అనుకూలంచేసి మనలను ఒడ్డుకు తీసుకొనివస్తాడు. ఒక డాక్టరు తన వృత్తిని బాగాచేయవచ్చు, ఒక ఇంజనీరు తన పనిని బాగాచేయవచ్చు, వ్యవసాయదారుడు కష్టపడి ఎక్కువ పంటలు పండించవచ్చు. ఇలా వృత్తిలో నేర్పుఉన్నంతమాత్రాన మానసిక వికాశంరాదు. మూలతలంపులోనుండి విడుదలపొందటానికి నీవు ఎంతవరకు ప్రయత్నం చేస్తున్నావో అంతవరకు నీకు మానసిక వికాశం వస్తుంది. లోపలనుండి ఎదుగుతూరావాలి, శక్తిని పెంచుకొంటూరావాలి. పైకి ఆడంబరంలేకుండా అందరిలాగే కనిపించాలి, నిర్మలంగాఉండాలి. మనంచేసేసాధన ప్రక్కవాడికి తెలియాలి అనుకోకూడదు. ప్రక్కవాడికి తెలియాలి అనుకొంటే మూలతలంపు మనలను దారితప్పించటంకోసం అలా అనిపింపచేస్తుంది. నిలువుబొట్లుపెట్టటం, అడ్డబొట్లుపెట్టటం యోగంఅనుకోవద్దు, సమానత్వమే యోగం. ఎవడికైతే సమత్వదృష్టిఉందో, ఎవడికైతేసమానబుద్ధిఉందో వాడేయోగి. సమానత్వంఅంటే మీకు పరిస్థితులు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా మీ మనస్సులో చలనంరాకూడదు. మీకులాభంవచ్చినప్పుడు పొంగిపోయి, నష్టంవచ్చినప్పుడు కృంగిపోతే మీకు సమానబుద్ధిలేదని అర్థం. మీకు సమానబుద్ధిలేకపోతే యోగంసిద్ధించదు, ఆత్మలాభం

కలుగదు. మీకు గౌరవంవచ్చినప్పడు పొంగిపోయేది, అగౌరవంవచ్చినప్పడు కృంగిపోయేది మూలతలంపు మాత్రమే, మీలోపలఉన్న సద్వస్తువుకు వీటితో ఎట్టి సంబంధంలేదు. ఇది మీకుబాగాఅర్థమవ్వాలి. సత్యానుభవం కలిగేవరకూ సాధ్యమైనంతవరకు రీజన్‌పట్టుకొని ఉండండి. భక్తిపేరుచెప్పి నదులలో పసుపు, కుంకుమ, పువ్వులువేసి నీటిని పాడుచేస్తున్నారు. ఇది భక్తిఅనుకొంటున్నారు, ఇదియోగంఅనుకొంటున్నారు నీసాధన నీవుచేసుకో నాజోలికిరావద్దు అని మూలతలంపు చెపుతుంది. అలాకాదు నీవుచేసే సాధనలో మూలతలంపును ఇమడ్చాలి. ఇప్పడు నీబుద్ధి సమానంగా లేకపోవచ్చు. నీవు లెక్కలునేర్చుకొన్నట్లు, సైన్సునేర్చుకొన్నట్లు నీబుద్ధిని సమానంగా ఉంచడంనేర్చుకో. నీ బుద్ధిని సమానంగా ఉంచుకొంటే గౌరవాలు, అగౌరవాలు, లాభనష్టాలవలనవచ్చే గాయాలు తగ్గుతాయి. అప్పడు దానికి లోచూపుకలుగుతుంది. ఎవడికైతే సమానబుద్ధిఉందో వాడిని భగవంతుడు జ్ఞానంతో అనుగ్రహిస్తాడు. అన్నిదానాలలోనికి నిదానంగొప్పది. నీవు నిదానంగాఉండి, మనస్సును పవిత్రంచేసుకో. నీకు తెలియనది వదిలెయ్యి. నీకు తెలిసినదానికి పవిత్రత పట్టించుకో. నీలోపలున్నవస్తువు ఎంత పవిత్రమయిందో నీమనస్సుకు అంత పవిత్రత వచ్చినప్పడు తదాకారం చెందుతుంది.

రమణమహర్షి ఏమార్గాన్ని ఖండించటానికి రాలేదు. ఎవరిమార్గంలో వారిని ప్రోత్సహించారు. మీరు సుఖపడాలి, మీరుజ్ఞానంపొందాలి. ఆయన జీవితంపొడుగునా ఏమతంగురించి బోధించలేదు. ఆయన చెప్పినది జ్ఞానమతం. లోపలఉన్న వస్తువుమీద ప్రేమపెంచుకొని, ఇష్టాన్నిపెంచుకొని సాధన చేయగాచేయగా అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు రాకపోకలతో పనిలేదు. ఎప్పడైతే నీవు ఎవరో నీకు తెలియబడిందో అంతా ఆనందమే ఆనందం. నేను సుఖపడాలి అనుకొంటున్నాను. ఎవడైతే సుఖపడాలి అనుకొంటున్నాడో వాడిని తీసెయ్యమని మీరుచెపుతున్నారు. వాడిని తీసేస్తే ఇంక సుఖంఏమిటండిఅని భగవాన్‌ను అడుగుతున్నాడు. అదా నీసందేహం? సుఖపడేవాడిని తీసేస్తే నీ ఎంజాయ్‌మెంటుపోతుంది అనుకొంటున్నావు ద్వైతంలో ఒకవస్తువు ఇంకోవస్తువును ఎంజాయ్‌చేస్తుంది. అద్వైతానుభవంలో ఏదైతేఉందో దానిని అదే ఎంజాయ్‌చేస్తుంది, నీ ఎంజాయ్‌మెంట్‌కు ఏమీభంగంలేదు. అద్వైతానుభవంలో సుఖం ఉండదేమోఅని నీవు ఊహించుకొంటున్నావు. నీఊహ కరెక్టుకాదు. శాస్త్రాలు, పంచకోశాలు, లోకంఅన్నీ బయటఉన్నాయి. కాని లోపలనీవు ఒక్కడివే ఉన్నావు. అది తెలిశాక

అంతా అదేఅని నీకు తెలుస్తుంది. నేరుగావెళ్ళి ఆత్మనుపట్టుకో, నీవుఏదిగాఉన్నావో దానినిపట్టుకో. చిన్నచిన్న స్టేషన్‌లలో ఆగవద్దు, టైమువృదా అవుతుంది. సూపర్‌ఫాస్ట్ ట్రైనులావెళ్ళిపో, గమ్యంమర్చిపోవద్దు. ఏవస్తువును పొందుదామని అనుకొంటున్నావో దానిని ప్రేమించు దానిపట్ల ప్రేమలేకుండా, భక్తిలేకుండా అర్పణభావన లేకుండా అది నీకు తెలియబడదు. నీవుకాలాన్ని సద్వినియోగంచేసుకోలేదుఅనుకో, అశ్రద్ధచేసావుఅనుకో సడన్‌గా నీ శరీరం చనిపోవచ్చు, అప్పుడు ఈజన్మలో వస్తువును పొందటానికి నీకు టైముఉండదు. అది ధనంవలనగాని, గౌరవంవలనగాని, పాండిత్యంవలనగాని పొందబడేదికాదు. ఆత్మకానిదానిని ఎవడైతే త్యాగంచేస్తాడో వాడికిమాత్రమే ఆత్మానుభవం కలుగుతుంది. త్యాగికానివాడు జ్ఞానికాలేడు.

నిజంకానిదానిని నిజం, నిజం అనుకొని వందజన్మలు కూర్చున్నావుఅనుకో, అదినిజంకాదని తెలిసాక మరలసాధన మొదలుపెట్టవలసివస్తుంది. చాలాజన్మలు దుర్వినియోగం అవుతాయి, శక్తివృధాఅవుతుంది. దేహాభిమానాన్ని తగ్గించుకో. మనస్సు పల్చబడాలి. ఎలా జీవిస్తే మనస్సు పల్చబడుతుందో అలా జీవించటం నేర్చుకో. బుద్ధిని సమానంగా ఉంచటంనేర్చుకో, దానికి ఓర్పుఉండాలి. ముందు ఓర్పునేర్చుకో. ఓర్పునేర్చుకొన్నాక సర్దుకుపోవటం నేర్చుకో. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటం చాలాకష్టంఅని నేను అనుకొంటున్నాను, అది చాలాతేలిక అని మీరుచెప్తున్నారు అని భగవాన్‌ను అడిగితే నీవుదేహంకాకపోయినా, మనస్సుకాకపోయినా వాటిచుట్టూ తిరుగుతున్నావు. మూలతలంపుకు వచ్చే ఇతర తలంపులు నీవుఅనుకొని వాటిచుట్టూ తిరుగుతున్నావు. అది నీకుతేలికగాఉందా? మూలతలంపు మూలంలోనికి వెళ్ళమంటే కష్టంగాఉందాఅని భగవాన్ అంటున్నారు. నీఇంటికి నిన్ను వెళ్ళమంటే నీకు కష్టంగాఉందా? మన నిజమైన ఇంటికి వెళ్ళటానికే సాధన. ఎక్కడ మొదలుపెట్టాలిఅని అడుగుతున్నాడు. దేహానికి పుట్టుకఉంది, మరణంఉంది. ఆత్మకు పుట్టుకలేదు, మరణంలేదు. దానికి మొదలులేదు, చివరలేదు. ఏదోసాధనలుచేస్తున్నాను అని ఇప్పుడు నీవుఅనుకొంటున్నావుకాని ఆత్మానుభవం కలిగాక ఇవినిజంకాదుఅని నీకు తెలుస్తుంది. నిద్రలో ఒకోసారి కారులో ప్రయాణంచేస్తున్నట్లు అనిపిస్తుంది. మెలుకువవచ్చాక మంచంమీదే ఉంటాము. అంటే ఆకారు స్వప్నమే, ప్రయాణం స్వప్నమే. మనం మంచంమీదే ఉన్నాము ఇదిఅంతా నిజంకాదుఅని మెలుకవవచ్చాక నీకు తెలుస్తుంది అలాగే నీకు ఆత్మానుభవంకలిగాక గతించినజన్మలు, ఇప్పటివరకు చేసినసాధనలు ఇవిఏమీ నిజంకాదు అని నీకు తెలుస్తుంది. నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు, నీహృదయంలోఉన్న ఆనందం పొంగి నీసహస్రారాన్ని

ముంచినప్పడు ఈ సుఖంఇట్టిదా, ఆనందంఇట్టిదా దీనితో పోల్చటానికి ఈ లోకంలో ఏమీలేదు అని నీకు తెలుస్తుంది.

ఇప్పడు దేహం గెద్దనపల్లిలోఉంది. ఆ దేహం నీవుఅనుకొంటున్నావు కాబట్టి నేను గెద్దనపల్లిలోఉన్నాను అనుకొంటున్నావు. దేహగతమైన నేనుఇలాఅనుకొంటోంది నీకు ఆత్మానుభవంకలిగాక ఆత్మఅంతటా ఉందికాబట్టి నేనుఅంతటా ఉన్నాను, నేనులేనిచోటుఅంటూలేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. అంతటా నీవేఉన్నప్పడు ఇంకెక్కడికి వెళతావు. దానికి మొదలుఏమిటి? చివరఏమిటి? నీకు ఆత్మానుభవం కలిగాక చూడటానికిఅంటూ ఏమీమిగలదు, వినటానికి ఏమీమిగలదు. నీచేత చూడబడేది ఏదీ నిజంకాదు కాని నీవునిజం. అదేఆత్మ, అదేచైతన్యం. నీచేత నీదేహంచూడబడుతోంది, నీమనస్సు చూడబడుతోంది, ఈలోకంచూడబడుతోంది. నీచేత చూడబడేది ఏదీ నిజంకాదు. నీకు జపం ఇష్టంఅయితే జపంచేసుకో అలాతరించు. లేకపోతే జపంచేసే జపిఎవడు అని ప్రశ్నించి వాడి కొమ్ములుపట్టుకో. తోకపట్టుకోవద్దు. తోకపట్టుకొంటే జాడించుకొనిపోతాడు. కొమ్ములుపట్టుకొని ఆపుచెయ్యి. నీవు సాధనచేసిఏదోమార్గంలో ప్రయాణించి పోగొట్టుకోవలసింది ఏదో దానిని పోగొట్టుకో. అప్పడు నీవు ఏదిగాఉన్నావో అది నీకుతెలియబడుతుంది. నీవు దేహాభిమానాన్ని పోగొట్టుకోవాలి. దానిని ఆరోజుకారోజు తగ్గించుకో, కొంతమంది మేము మాటఅంటే ఏమీపడముఅంటారు. అంటే వారికి దేహాభిమానం ఎక్కువగా ఉన్నట్లుగుర్తు. దేహాభిమానం ఎక్కువగా ఉన్నప్పడు ఎవరైనా చిన్నమాటఅన్నా తట్టుకోలేము. చిన్నమాటఅంటేనే తట్టుకోలేనప్పడు మనకు ఆత్మానుభవం ఎలాకలుగుతుంది.

నేనుఎవడను? అంటే ఇప్పడు ఏదైతే నీలోపలనుండి నేనుగా నీకు వ్యక్తమవుతోందో ఆనేను ఎవరుఅని ప్రశ్నించటం. ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో దానిమూలంలోనికి అదివెళితేగాని అది నశించదు. అదిదాని మూలంలోనికి వెళ్ళేవరకూ వేటగాడు ఏవిధంగాఅయితే జంతువులను వెంటాడి వేటాడుతాడో అదేవిధంగా నీవు మూలతలంపును పట్టుకొని దానిని ఉపసంహరించి దానిమూలం ఎంతలోతులలోఉందో అక్కడకు దానిని పంపితే అదినశిస్తుంది, అప్పడు నీకు జ్ఞానోదయం అవుతుంది. భగవంతుడిని నిరంతరం స్మరించటంవలన, భగవంతుడితో నిరంతరం మానసిక అనుబంధం కలిగిఉండటంవలనకూడా మూలతలంపు నశిస్తుంది.

# భగవంతుడిమీద మనకున్నభక్తి అందరికీతెలియాలి అనుకుంటే అహంకారం పెరుగుతుంది

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 30-08-2001, కోలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వర్తమానకాలాన్ని విడిచిపెట్టవద్దు, చేతిలోఉన్న పనిని విడిచిపెట్టవద్దు. ఆధ్యాత్మికంగాకాని, భౌతికంగాకాని అభివృద్ధిలోనికిరావాలంటే చేతిలోఉన్నపనిని శ్రద్ధగా, ప్రేమగాచేయండి. అదే అభివృద్ధికిబాట, దానివలన ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. చాలామంది జరిగిపోయిన గొడవలుఅన్నీ తలపెట్టుకొని దుఃఖపడుతూఉంటారు. అది అభివృద్ధిలోనికి వచ్చేవారి లక్షణంకాదు. రేపు జాగ్రత్తగురించి నీవు ఆలోచించనక్కరలేదు. ఈరోజు తీసుకోవలసిన జాగ్రత్త నీవు తీసుకొంటే ఈజాగ్రత్తే రేపటిరోజు జాగ్రత్తను తీసుకొంటుంది. అంతేగాని ఈరోజు పనిగురించి వదిలేసి రేపటిగురించి ఆలోచిస్తే దానివలన ఏమీప్రయోజనంలేదు. కొంతమంది జరిగిపోయిన సంఘటనలు తలపెట్టుకొంటూ, భవిష్యత్‌గురించి ఊహించుకొంటూ వర్తమానకాలం పాడుచేసుకొంటారు. మారోజులు ఎలావెళతాయి, మమ్మల్ని ఎవరుచూస్తారు అనిఅంటూఉంటారు. అందరికి ప్రభువు ఈశ్వరుడే. అంతా ఆయనేచూసుకొంటాడు. సంపదలు లేకపోయిన కొంతమందికి రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. కొంతమందికి ఎంతసంపదఉన్నా భోజనానికి ఇబ్బందిపడుతూఉంటారు. మనకు తెలిసినా, తెలియకపోయినా భగవంతుని సంకల్పంలో జీవుడికి ఏరకంగా యాత్రనడవాలో అది నిర్ణయింపబడి ఉంటుంది, దానిప్రకారం ఆ జీవుడియాత్ర జరుగుతూఉంటుంది. భవిష్యత్‌గురించి లేనిపోనివి ఊహించుకోవటంవలన భయం కలుగుతుంది. ఊహించుకోవటం మానివేస్తే భయంలేదు.

పూర్వం అనేకమంది తపస్సులుచేసి పవిత్రులుఅయ్యి, నాస్వరూపమును పొందారు సందేహంపెట్టుకోవద్దు. మీరుకూడా ప్రయత్నంచేసి నాస్వరూపమును పొందండి అని భగవంతుడు చెపుతున్నాడు. రాగం, భయం, క్రోధం ఇవి మూడు తగ్గించుకోమని భగవంతుడు చెపుతున్నాడు. ఎందుచేతనంటే ఇవిమూడు అహంవృత్తిని పెంచుతాయి. అహంవృత్తి మూలంలోనికి వెళ్ళటానికి ప్రయత్నంచెయ్యి, అహంవృత్తి మూలంలోనే పరమేశ్వరుడుఉన్నాడుఅని భగవాన్ చెప్పారు. రాగం, భయం, క్రోధంఉంటే నీవు అహంవృత్తిమూలంలోనికి ఎలావెళ్ళగలవు, ఇవి అహంవృత్తి మూలంలోనికి వెళ్ళనివ్వవు నిన్ను

గొలుసులు వేసుకొని బయటకు లాగుకొనివస్తాయి. ఇవిఉంటే అహంవృత్తి మూలంలోనికి వెళ్ళాలన్నా నీవువెళ్ళలేవు. అది మాటలుచెప్పినంత తేలికకాదు. అనేక బాహ్యకారణాలవలన నీకు శాంతిరావచ్చు, అది నిజమైనశాంతికాదు. నీలోపల చైతన్యంఉంది. ఆ చైతన్యానుభవం పొందాలి అనేదానిమీదే నీగురిఉండాలి. అప్పుడు మాత్రమే అది నీకు తెలియబడుతుంది. అక్కడనుండి నీకు శాంతి, ఆనందం అందితే అది నీ కడసారిజన్మ. బాహ్యకారణాలవలన నీకు సుఖంవచ్చినా అది దుఃఖంగామారిపోతుంది. నీవు ఏపనిచేసినా ఆసక్తిపెట్టుకోవద్దు. ఆసక్తివలన మనస్సు బయటకు వచ్చేస్తుంది. నీచేతిలోఉన్నపనిని శ్రద్ధగా, ప్రేమగా, ప్రీతితో చెయ్యి. అది కర్మయోగం. లోకంతో ఎక్కువ అనుబంధం పెట్టుకోవద్దు. నీవు అన్నివిషయాలలో కలుగజేసుకోవద్దు. సమాజంతో అనుబంధంలేకుండా బ్రతకలేముకాబట్టి అనుబంధం ఎంతవరకుఉండాలో జాగ్రత్తగాచూసుకోవాలి. నీవు మోక్షంపొందాలంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంతముఖ్యమో నీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా వాటిని సహించటం నేర్చుకోవటంకూడా అంతేముఖ్యం. కొంతమంది చిన్నకష్టంవచ్చినా సహించలేరు. కష్టంవచ్చినా కెరటంలేని సముద్రంలాగ ఉండటం నేర్చుకోవాలి. నీవు ఏవస్తువునుఅయితేపొందాలో దానిమీదే నీగురిఉండాలి.

నీకు ఉద్రేకం ఎక్కువగావస్తూఉంటే రజోగుణానికి దగ్గరగాఉన్నట్లుగుర్తు. నిద్ర, తిండిఅంటే ఇష్టంగాఉంటే తమోగుణానికి దగ్గరగాఉన్నట్లుగుర్తు. సత్వగుణంలోఉంటే మనస్సు, శరీరం తేలికగాఉంటాయి, కష్టపడి మనపని మనంచేసుకోవాలి అనిపిస్తుంది, చేతనయితే ఇతరులకు సహాయంచేయాలని ఉంటుంది. మనం సత్వగుణాన్ని పెంచుకోవాలి. రజోగుణంతగ్గాలి, తమోగుణంతగ్గాలిఅంటే అవి తగ్గవు నీవు సత్వగుణాన్ని పెంచుకొంటే రజోగుణం, తమోగుణం ప్రభావంతగ్గుతుంది. మనపొట్టకు తిన్నది మనకూడారాదు. ఇతరులకు సహకరించిందే మరణానంతర జీవితంలో నీకూడా వస్తుంది. ఇది మనకు తెలియటంలేదు. నీవు ఏపనిచేస్తున్నా, నీదేహప్రారబ్దం ఎలాఉన్నా లోపలఉన్న చైతన్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటంమీదే నీగురిఉండాలి. అక్కడనుండి నీకు శాంతిఅందాలి. అది ఒక్కటే నిజమైన శాంతి. వ్యక్తిఅంటే శరీరం, మనస్సు, తెలివి. చనిపోయేవరకు మనిషి ఈమూడింటితో కలిసిఉంటాడు. కాని ఈ మూడునీవుకాదు. నీవుఆత్మవు నీవుకాని విషయాలను ఆత్మమీద ఆరోపిస్తున్నావు. ఈ ఆరోపణవదిలేస్తే ఇప్పుడే, ఇక్కడే శాంతిసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు. ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు, ఆత్మలోగుణాలులేవు, దానికి ద్వితీయంలేదు. కాని

మనస్సులోఉన్న గుణాలను, శరీరంయొక్క చావు, పుట్టుకలను ఆత్మమీద ఆరోపించి, దుఃఖపడుతున్నావు. ఇలా ఎంతకాలంఅయితే ఆరోపిస్తున్నావో అంతకాలం ఈకర్మబంధంలోనుండి నిన్ను ఎవరూ విడుదలచేయలేరు. నీవు నీవుగాఉంటే ఏగొడవలేదు అంటారు భగవాన్. నీవు దేహంగాఉండకు, నీవుమనస్సుగాఉండకు, నీవునీవుగాఉండు. నీవునీవుగాఉంటే నీవు ఏద్వైతేకాదో దానిలోనుండి విడుదలపొందుతావు. మీగురించి మీరు ఎంతతక్కువగా ఆలోచిస్తే భగవంతుడు మీగురించి అంతఎక్కువగా ఆలోచిస్తాడు. హృదయంలో ఎక్కువగాఉండటం అలవాటుచేసుకో. హృదయం ఒకరకంగా చెపుతోందిఅనుకో, నీమనస్సు ఇంకోరకంగా చెపుతోందిఅనుకో. నీమనస్సు చెప్పినదానిని ఒకప్రక్కకుపెట్టి హృదయంచెప్పినట్లు చెయ్యి నీవు బాగుపడతావు. నీవుకానిది నీవు అనుకొంటున్నావు. నీవుకానిదానిలోనుండి బయటకురావటానికే జపం, ధ్యానం, విచారణ. నీవు నిజానికి దూరంగాఉన్నావు, లోకానికి దగ్గరగాఉన్నావు. ఎంతకాలంఅయితే లోకానికి దగ్గరగాఉన్నావో, ఎంతకాలంఅయితే నీకులోకంతో తాదాప్యంఉందో అంతకాలం నీవు అసత్యంలోఉండితీరవలసిందే. నీకు ఉపయోగపడేవనిచేసుకొని, అక్కరలేనివ్యాపకాలు తగ్గించుకో. నీశరీరం ఆరోగ్యంగాఉండాలంటే నీమనస్సు సహకరించాలి. మనస్సు ఆరోగ్యంగాఉండాలంటే జపం, ధ్యానం శ్రద్ధగాచేయాలి, సాధన శ్రద్ధగాచేయాలి.

భక్తిని రహస్యంగాఉంచుకోవాలి. భక్తిఅనేది నీకు భగవంతుడికి సంబంధించిన విషయం, ఇదిఅందరికీ తెలియాలిఅనుకొంటే అహంకారం పెరుగుతుంది. ఎన్ని యోగాభ్యాసాలుచేసినా ఈశ్వరునిపాదాలయందు భక్తిలేకపోతే, ఆయన అనుగ్రహంలేకుండా మనం పునర్జన్మ కారణములనుండి విడుదలపొందలేము. రాగద్వేషములను, ఉద్రేకాలను భక్తి తగ్గించుకొంటూవస్తుంది. ఉన్నదానితో సంతృప్తిపడకపోతే, ఏదోఆశిస్తూఉంటే ఒకోసారి ఉన్నదిపోతుంది. నిరంతరంఏదో ఆశించేవాడికి, వాడికి 100 కోట్లు ధనంఉన్నా ఆ ఉన్నదానిలో ఉన్నసంతృప్తివాడికి తెలియదు. ఏదివచ్చినా అది ఎప్పడూఉండదుఅనుకో. నీకు మంచివచ్చినా, చెడ్డవచ్చినా, గౌరవంవచ్చినా, అగౌరవంవచ్చినా, సుఖంవచ్చినా, దుఃఖంవచ్చినా ఇవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. ఇవిఏమీ నిజంకాదు అందువలన ఏదివచ్చినా ఇది శాశ్వతంగా ఉండదుఅనుకో. ఇప్పడు మనకు తినటానికి అన్నంఉంది, సాధనచేసుకోవటానికి అనేక అనుకూల పరిస్థితులు ఉన్నాయికాని సాధనచేయలేకపోతున్నాము. ఇదే మాయ. వారు మనకు ఏమిఉపకారంచేసారు, వీరు మనకుఏమి ఉపకారంచేసారు అనిఅనుకొంటూ

ఉంటాము. అలా అనుకొనేబదులు వారికి మనం ఏమి ఉపకారం చేసాముఅని ప్రశ్న ఎందుకువేసుకోవుఅంటే నీబుద్ధిలో ఏదోదోషంఉందిఅని అర్థం.

ఉన్నదేదో ఒకసద్వస్తువు నీలోపలఉంది. దాని విషయంలో సందేహంవద్దు. ఎలాజీవిస్తే-ఆవస్తువు నీకు తెలియబడుతుందో తదనుగుణంగా జీవించండి. నీకు మోక్షంఇచ్చేది లోకంకాదు, మోక్షంఇచ్చేది ఈశ్వరుడు. ఎవడైతే మోక్షంఇస్తాడో వాడిఅనుగ్రహంపొందాలిగాని లోకంయొక్క మెప్పులుకాదు. లోకంమీద మమకారం ఎక్కువగాఉన్నంతకాలం నిజం నీకు అనుభవంలోనికిరాదు. ఆత్మ ఆడంబరంగాఉండదు అందుచేత నీవుకూడా ఆడంబరంలేకుండా ఉండు. నీమాటలో, చేతలో, వేషధారణలో, దైనందినజీవితంలో నీవ్యవహారంలో ఆడంబరంఉండకూడదు. లోపలఉన్న వస్తువుకు ఆడంబరంలేదు అందుచేత నీవుకూడా ఆడంబరంలేకుండా జీవిస్తే లోపలఉన్న వస్తువు నీకు నిజమైన నేనుగా వ్యక్తమవుతుంది, అదే నారాయణస్వరూపం.

కాటన్‌దొరకు మానవజాతిఅంటే ప్రేమ. పూర్వం ఉభయగోదావరి జిల్లాలలో కరువువచ్చినప్పడు గోదావరికి ఆనకట్ట కట్టడంకోసం బ్రిటిష్‌వారు అడిగితే తానుకడతానని వచ్చాడు. ఆయన ఆనకట్టకట్టే సమయంలో ఖర్చుఎక్కువ అవుతోందిఅని ప్రభుత్వం తిట్టేది, ఆనకట్టవలన కాలవలు వస్తాయి, పడవలలో ప్రయాణాలుచేస్తారు మాకు పనిఉండదుఅని బండ్లుతోలుకొనేవారు తిట్టేవారు ఇవిఅన్నీ భరించి ఇంటికివస్తే ఇక్కడ పాముల బాధపడలేకపోతున్నాము ఈ గ్రామంలో ఎందుకు మనం పట్టణాలలో ఉండవచ్చుకదా అని భార్యతిట్టేదట. ఇన్ని అవమానాలు భరించి ఆయన ఆనకట్టకట్టారు. ఈమధ్య గోదావరి జిల్లాలలో కాటన్ విగ్రహాలు ఎక్కువగా పెడుతున్నారు ఏమిటిఅని నన్నుఅడిగారు. ఆయనఏదో మంచిపని చేసివెళ్ళిపోయాడు. ఇంత గౌరవంవస్తుందిఅని ఆయనఅనుకోలేదు. చేసిన మంచికి ఫలం విగ్రహాలరూపంలో ఆయనను స్మరించుకొంటున్నారు. ఇలా స్మరించుకొంటారని ఆయన ఆనకట్ట కట్టలేదు. ఆయనచేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేసివెళ్ళిపోయాడు అనిచెప్పాను. మీచేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేయండి. చేతిలోఉన్న పనిని వదిలేసి భవిష్యత్ గురించి ఊహించుకోవటం చెడ్డ, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటంకూడా చెడ్డే. మీరు విజయం సాధించటానికి చేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేయండి, ప్రేమగాచేయండి, నిష్కామంగాచేయండి. నిండుమనస్సుతో అంకితభావంతో చేయండి. అది కర్మయోగం. ఇలాచేయటంవలన మీరు కర్మయోగి అవుతారు, ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది, మోక్షద్వారం తెరువబడుతుంది.

# ఎవరిసన్నిధిలో నీమనస్సుకు లోచూపు కలుగుతుందో వారే నీగురువు

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 02-09-01, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి మమత, ఆసక్తి, కర్మఫలంపట్ల అపేక్ష తగ్గించుకోమని భగవంతుడు చెప్పాడు. మనం మమకారాన్ని నెమ్మదిగా తగ్గించుకొంటూరావాలి. కర్మఫలంపట్ల ఆపేక్ష ఉండకూడదు. దేహప్రారబ్దంలోఉన్నది కోరిక లేకపోయినావస్తుంది కోరికలేకుండా వచ్చినది మనలను బంధించదు, అది చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. కోరికతో తెచ్చుకొన్నది మనలను బంధిస్తుంది. మనకు ఒకేసారి పూర్ణత్వంరాదు. చిన్నచిన్నమంచిపనులు, సేవలు, సహాయాలు చేసుకొంటూవస్తే మన జీవితంలో పూర్ణత్వం వస్తుంది. కొంతజపంచేయటం, కొంతధ్యానంచేయటం, మనగురించి మనం ఆలోచించుకోవటమే కాకుండా కొద్దిటైము ఇతరులగురించి ఆలోచించటంఅంటే ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడటం ఇలాచేసుకొంటూరావాలి. ఇతరులగురించి ఆలోచించటంవలన, వారికి సహాయపడటంవలన నీ చైతన్యస్థాయి పెరుగుతుంది. శ్రద్ధలేకుండా ఆధ్యాత్మికజ్ఞానమేకాదు భౌతికజ్ఞానంకూడా కలుగదు. నీకు శ్రద్ధఎలాకలుగుతుందిఅంటే సాధుపురుషులతో సహవాసం చేయటంవలన, వారికి సేవచేయటంవలన మీకుశ్రద్ధకలుగుతుందిఅని శాస్త్రంచెపుతోంది. శ్రద్ధకలవాడి దృష్టిఅంతా సాధనమీదే ఉంటుంది. దేహం క్షణభంగురం దానిగురించి ఆలోచించి కాలాన్ని వృధాచేసుకోవద్దు. ఈరోజుఉన్నశరీరం రేపుఉండకపోవచ్చు. నీవు చిన్నచిన్నపనులుచేసినా శ్రద్ధగా చేయటంవలన నీకు జ్ఞానంకలుగుతుంది, జ్ఞానంవలన నీకుశాంతికలుగుతుంది. శ్రద్ధఉన్నవాడిని సంసారం విడిచిపెడుతుంది. శ్రద్ధవలన నీ హృదయంలోఉన్న మహావెలుగును, ఆత్మను ఎప్పుడైతే దర్శించావో అప్పుడు శాంతికోసం నీవు శరీరం మరణించేవరకు ఆగనక్కరలేదు, పరమశాంతి, నిర్వాణస్థితి శీఘ్రంగా, అతివేగంగా ఆక్షణంలోవచ్చి నిన్నువరిస్తుంది. అప్పుడువచ్చే శాంతి విషయాలమీద ఆధారపడినదికాదు, అది అలౌకికశాంతి. అది నీఇంద్రియాలకు, మనస్సుకు అందదు. దానిగురించి నీవు ఇతరులకు చెప్పాలన్నా చెప్పలేవు.

మానవుడు ఏ పరిస్థితులలోఉన్నవాడికి జ్ఞానంకలిగేవరకూ ఏదోరకమైనా దుఃఖం, అశాంతి, వెలితి వాడిని వెంటాడుతూఉంటాయి. ధనంలేనివారు ధనవంతులు అందరూ

సుఖపడుతున్నారుఅని అనుకొంటారు. అదేమాయ. ధనంవలన మోక్షంకలుగదు, శాంతిరాదు. సూదిబెజ్జంలోనుండి ఒంటెను బయటకు లాగవచ్చునేమోగాని ధనవంతుడిని స్వర్గరాజ్యంలోనికి పంపలేము అని యేసుచెప్పారు. ధనాన్నిబట్టి మంచితనం పెరగదు, మనోవికాశంరాదు, చైతన్యస్థాయిపెరగదు. మానవుడు మొదట కోరికలతోనే భగవంతుడిని ధ్యానంచేస్తాడు. ఇలా కొంతకాలంచేసాక, కొన్నికోరికలు నెరవేరినతరువాత ఈ కోరికలలో ఏమీలేదు, ఇవి నెరవేరటంవలన కలిసివచ్చేది ఏమీలేదుఅని వాడికి వివేకం కలిగి నాకు కోరికలువద్దు, నీకృపేకావాలిఅని అప్పుడు దేవుడినిప్రార్థిస్తాడు. ప్రపంచంలో ధనవంతులను మనం ఐశ్వర్యవంతులుఅని అనుకొంటాముకాని ఏ కోరికలులేనివాడు అంతకంటే పెద్ద ఐశ్వర్యవంతుడు, వాడు పూర్ణకాముడు. అన్నం తినటంవలన శరీరం ఎలాపెద్దది అవుతుందో అలా సాధనచేయటంవలన భక్తిలో పెద్దవాళ్లం అవుతాము. భక్తిలో పెద్దవాడవుఅయ్యాక నాకు కోరికలువద్దు, నీకృపేకావాలి, నీ అనుగ్రహం తప్పించి నాకుఏమీ అక్కరలేదు అనేస్థాయికి ఈభక్తుడువస్తాడు. భగవంతుడు అందరి హృదయాలలోఉన్నాడు. భగవంతుడులేని హృదయంలేదు కాని అందరి హృదయాలలో వ్యక్తంకాడు. ఎవరి హృదయంఅయితే పరిశుద్ధమయ్యిందో, పవిత్రతతో నిండిఉందో వాడిహృదయంలో భగవంతుడు వ్యక్తమవుతాడు. వాడినే ఋషి, యోగి అంటాము, నీకుఉన్న దేహబుద్ధిని ఎండింపచేయటమే తపస్సు. అలా తపస్సుచేస్తూఉంటే మనస్సు క్రమేపి పవిత్రంఅవుతుంది. అప్పుడు భగవంతుడికృప రూపం దాల్చుతుంది. వాడేగురువు భగవంతుడిలోఉన్నదయే గురువుగావస్తుంది. అలా గురువుగావచ్చి భక్తుడికి జ్ఞానంగురించి, ఆత్మగురించి బోధిస్తాడు. అలా బోధించి నీ మనస్సును నిర్మలంచేస్తాడు, ఏకాగ్రంచేస్తాడు, సూక్ష్మంచేస్తాడు. నీ హృదయంలోఉన్న వస్తువును పట్టుకోవటానికి నీకు యోగ్యతను కలుగజేస్తాడు.

నా మనస్సు బాగాలేదు, నామనస్సు బాగాలేదు అని చాలామంది చెపుతూఉంటారు. దీనికి భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే ఆ మనస్సువు నీవుకాదుకదా అది బాగాలేకపోతే నీకు ఎందుకు అంటున్నారు. నీ మనస్సు బాగాలేదుఅంటున్నావు. అదినీవుకాదు కదా. అది నీవుఅయితే కంగరుపడవచ్చు. అది నీవుకాదు. నీవుకానిది నీవుఅనుకొన్నా అదినీవుఅవ్వవు. ఇది మీకు అర్థంఅవ్వాలి. నీ ఇష్టాలు, అయిష్టాలు, ఉద్రేకాలు ఇవిఅన్నీ మనస్సులోఉన్నాయి. ఉంటేఉండనియ్యి అదినువ్వుకాదు. మనస్సు నీవుఅయితే గాఢనిద్రలోకూడా మనస్సు నిన్ను విడిచిపెట్టకూడదు. కాని గాఢనిద్రలో నీకు మనస్సు గొడవలేదుఅంటే అది నీవుకాదు.

శరీరధర్మాలను, మనస్సులోఉన్న గుణాలను నీమీద ఆరోపించుకొంటున్నావు. ఈ ఆరోపించుకోవటం లేకపోతే నీకు పుట్టుకలేదు, మరణంలేదు. కొంతమందికి ఎంతకాలం జీవించినా వారికి మానసికజీవితంఉండదు. మానసికజీవితం లేనివాడికి ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టే అవకాశంలేదు. ఎంతోకొంత మానసికజీవితంఉండాలి. మనం గురువును ఎన్నుకోవటంవేరు, గురువు మనలను ఎన్నుకోవటంవేరు. గురువును మనం ఎన్నుకొంటే ఆ గురువును మార్చేయగలము. గురువే మనలను ఎన్నుకొన్నప్పుడు ఆ గురువునుండి మనం విడుదలపొందలేము, గురువుతో అనుబంధం తెంచుకోలేము. గురువుతో ఎన్నుకోబడ్డ జీవుడు తరించబడే తీరుతాడుకాని వాడు తప్పుకొనే అవకాశంలేదు. నీకు మానసిక జీవితంఉంటే గురువు చెప్పినమాటలను లోపలకు తీసుకొంటావు, గురువుచెప్పినట్లు సాధనచేస్తావు, లోపలపవిత్రంఅవుతావు, అప్పుడు నీకు జ్ఞానంకలుగుతుంది, శాంతి కలుగుతుంది. గురువు నీతో ఏదో లోకవిషయాలు, కుటుంబవిషయాలు మాట్లాడుతూఉంటాడు. వాటికి జ్ఞానానికి ఏమీసంబంధంలేదు. నిన్ను ఎక్కడికి తీసుకొనివెళ్ళాలో దానికి ప్రిపేర్‌చేయటానికి నీతో అలామాట్లాడుతూ నిన్ను సన్నిహితం చేసుకొంటాడు. అదిగ్రహించినవాడు ధన్యుడు. ఆత్మానుభవం పొందటానికి నీకు ఏవైతే అడ్డువస్తున్నాయో గురువు చూస్తూఉంటాడు. వాటిని తొలగించుకోవటానికి నీకు శక్తిని ప్రసాదించి వాటిని తొలగింపచేస్తాడు. నీలోఉన్నదోషం గుర్తించి దానిని నీకుచూపిస్తాడు, దానిని తొలగించుకోవటానికి నీకు ఉపాయంచెపుతాడు, దానినుండి విడుదల అవ్వటానికి శక్తినిఇస్తాడు, నీచేత వాటిని తొలగింపచేయటానికి చూస్తాడు. ఒకవేళ ఈజన్మలోనీవు దానిలోనుండి బయటకురాలేకపోతే నీకూడాఉండి రాబోయే జన్మలలో ఆపనిపూర్తిచేస్తాడు. వాడుగురువు. గురువు ఏదిచేసినా మనమంచికే చేస్తున్నాడుఅని మానసిక జీవితం ఉన్నవాడు గుర్తిస్తాడు, మానసిక జీవితం లేనివాడు దానిని గుర్తించలేడు.

పుణ్యంవలన మంచిజన్మలు, పాపంవలన చెడుజన్మలురావచ్చు. పుణ్యంమిగిలిన ప్రమాదమే, పాపంమిగిలిన ప్రమాదమే. అగ్ని వస్తువులను ఎలాదహిస్తుందో అలాగ నీవు నిష్కామంగా పనిచేస్తూఉంటే, ఆత్మజ్ఞానంతో పనిచేస్తూఉంటే నీలోఉన్న పుణ్యపాపములను, పునర్జన్మ కారణములను నిశ్శేషంగా జ్ఞానాగ్ని దహించేస్తుంది. ప్రతీగొప్పవాడు మంచివాడు అవ్వనక్కరలేదు. ప్రతీ మంచివాడు గొప్పవాడు అవ్వనక్కరలేదు. గొప్పతనం ఆత్మజ్ఞానానికి

దారిచూపించదుగాని మంచితనం ఆత్మజ్ఞానానికి దారిచూపిస్తుంది. మీ అనుగ్రహం మాకులేదుఅని భగవాన్‌తో కొంతమంది అనేవారు. నా అనుగ్రహం నిజంగాలేదుఅనుకో ఇక్కడికి ఎందుకువస్తావు అన్నారు భగవాన్. నీ తెలివితేటలవలన ఇక్కడకువచ్చాను అనుకొంటున్నావు. నీ తెలివితేటలవలన రాలేదు, నా అనుగ్రహమే నిన్ను తీసుకొనివచ్చింది. భగవాన్ దగ్గరకు వెళ్లటం ఎందుకంటే మనం ఆయనను చూడటంకాదు, ఆయనచేత చూడబడటం ముఖ్యం. మన కళ్లలో ఏమైనా శాంతిఉందా? జ్ఞానంఉందా? ఈ మాంసపునేత్రాలు ఏమిచూస్తాయి. ఆయన కళ్లలో ఎంతోజ్ఞానంఉంటుంది, శాంతిఉంటుంది, దయఉంటుంది. ఎందుచేతనంటే ఆత్మేకాళ్ళుచేతులు తొడుక్కొని అక్కడఉంటుంది. ఎవరిని గురువుగా ఎంచుకోమంటారుఅంటే ఎవరిసమక్షంలో నీకు శాంతికలుగుతోందో, ఎవరిసమక్షంలో నీకు జ్ఞానంసంపాదించాలిఅనే అపేక్ష కలుగుతోందో, ఎవరిసమక్షంలో నీ మనస్సుకు లోచూపు కలుగుతోందో వారినే నీగురువుగా ఎంచుకో. నీ బాధ్యతలు, భారాలను పెంచేవాడు గురువుకాదు. నీ బాధ్యతలనుండి, భారాలనుండి నిన్ను విడుదలచేసేవాడే గురువు. నిన్ను చీకటిలోనుండి వెలుగులోనికి తీసుకొనివచ్చేవాడే గురువు. నీవు ఏవిధంగా జీవిస్తే నీకు భగవదనుభవం కలుగుతుందో అది నీకు బోధించటమేకాదు, అలా ప్రాక్టీసుచేయటానికి, ఆరకంగా జీవించటానికి నీకు శక్తినిఇచ్చి, గమ్యానికి చేరటానికి నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. గురువుకు పనిఅంటూఏమీలేదు నీవు పూర్వజన్మలనుండి చేసిన పూజలకు ఫలితంగా భగవంతుడే గురురూపంలో వస్తాడు.

**గాఢనిద్రలో ఉన్నసుఖమును మనం జాగ్రదవస్థలో ఎఱుకతో అనుభవించాలి. అదే సమాధిస్థితి**